మీ గళం..మా కళం...

# నమస్తే హైదరాబాద్

NAMASTHE HYDERABAD | తెలుగు దిన పత్రిక | RNI No: APTEL/2012/45237

| రంగారెడ్డి | సోమవారం | 20-10-2025 | సంపుటి : 14 | సంచిక :134 | పేజీలు :8 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|
| RangaReddy | Monday | 20-10-2025 | Volume :14 | Issue:134 | Pages:8 | Cost : 3 |


విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ
విశేష ప్రజాధరణ పొందుతున్న
నమస్తే హైదరాబాద్
తెలుగు దిన పత్రికకు
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని
జిల్లా, మండల కేంద్రాలలో
విలేకరులు కావలెను.

సీనియర్‌లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం
Ph: 9912580066




హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్) దేశవ్యాప్తంగా దీపావళి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చిందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు రేవంత్. దీపాల కాంతులతో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నాపెద్ద ప్రతిఒక్కరూ ఆనందంగా దీపావళి జరుపుకోవాలని, ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో దీపావళి సంబరాలు మార్మోగిపోతున్నాయి. టపాసులు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిక్కిరిపోతున్నాయి.

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్) దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానపు తమస్సును తొలగించుకుని, ప్రతీ మనిషి తనలో జ్ఞానపు ఉషస్సులను వెలిగించుకోవాలనే స్ఫూర్తిని దీపావళి పర్వదినం అందిస్తుందని కేసీఆర్ అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన రాష్ట్రంలో ప్రగతి వెలుగులు పంచిందని, తెలంగాణ ప్రజల జీవితాలలో కమ్ముకున్న చీకట్లు తొలగి ఆనందపు వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా ప్రతి గడపలో ఆనందం వెల్లివిరియాలని కేసీఆర్ ప్రార్థించారు.

## ఆ జిల్లాలకు మహర్దశ: కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్) మార్చి 31, 2026 నాటికి దేశంలో నక్సలిజం హింసను పూర్తిగా నిర్మూలించేందుకు మార్గం సుగుమం అవుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో భాగంగా వందలాదిమంది నక్సలైట్లు ముందుకు వచ్చి హింసా మార్గాన్ని వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోవడాన్ని తాను స్వాగతిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ(ఆదివారం) హైదరాబాద్ లో కిషన్ రెడ్డి నక్సల్స్ అంశం, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి గురించి మాట్లాడారు. 'గత మూడు రోజుల్లోనే 300మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారు. పెద్దఎత్తున నక్సలైట్లు లొంగిపోవడం, అందులో ఎక్కువమంది తెలుగువారు ఉ ండటం ప్రత్యేక విషయం. ఇంతకాలం నక్సలిజం కారణంగా అనేక జిల్లాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. నేడు దేశమంతా దీపావళి వేడుకలు



జరుపుకుంటున్న వేళ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు చీకటి నుంచి వెలుగు వైపు అడుగులు వేస్తుండటం చాలా సంతోషించదగ్గ విషయం' అని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో దశాబ్దం క్రితం దేశంలో 125గా ఉన్న నక్సల్ ప్రభావిత జిల్లాలు.. నేడు 11కు తగ్గాయి. మిగిలిన ఈ 11 జిల్లాలు కూడా త్వరలోనే నక్సల్ రహిత జిల్లాలుగా మారతాయని ఆశిద్దామని కిషన్ రెడ్డి ఆకాంక్షించారు. 'అంబేడ్కర్ గారి రాజ్యాంగంలో హింసకు చోటు లేదు. అహింసా మార్గంలో ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకోవచ్చు. రక్తపాతం, హింస ద్వారా ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏమీ సాధించలేరనే సందేశం మరోసారి స్పష్టమయ్యింది.' అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

'నక్సలైట్ల కారణంగా ఇంతకాలం ఆ ప్రాంతాలు(నక్సల్స్ ప్రభావిత) రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి కూడా నోచుకోలేదు. కనీస మౌలిక వసతులు లేకుండా ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. నేడు నక్సల్ రహితంగా మారిన ఆయా జిల్లాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. అని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు.

## ఘోర ప్రమాదం..

ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మోతుగూడ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ద్విచక్రవాహనాన్ని కారు అతి వేగంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను కాగజ్ నగర్ మండలం వంజిరి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. మృతుల్లో జగన్ (27), డోంగ్రి అనసూయ(32), డోంగ్రి ప్రజ్ఞాశీల్(4) ఉన్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. అక్క అనసూయ, మేనల్లుడు ప్రజ్ఞాశీల్ తో కలిసి జగన్ బైక్ పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అయితే, ఈ ప్రమా దంలో మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుడిని హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక, వంజిరి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీపావళి వేళ ఒకే కుటుంబానికి, గ్రామానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్థులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

## పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు వెళ్తాం: కేటీఆర్



ఇంటర్నెట్ డెస్క్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్) ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నాడు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వీరిని కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌ను మొదటి దెబ్బ జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ కొట్టబోతుందని స్పష్టం చేశారు. రెండో దెబ్బ రాజేంద్రనగర్ లేదా ఖైరతాబాద్‌లో కొడుతామని తేల్చి చెప్పారు. కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నాడని మండిపడ్డారు. దమ్ముంటే కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికకు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల స్థానాల్లో ఉప ఎన్నికలు తథ్యమని స్పష్టం చేశారు. రెండేళ్ల

2లో

## సర్వేయర్లకు నియామక పత్రాలు పంపిణీ



2లో

# పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టుకు వెళ్తాం: కేటీఆర్

తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని.. కేటీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నాడని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎవరెవర్ని ఏం చేయాలో, ఎవరి బెండ్ ఎలా తీయాలో తీసి తీరుతామని హెచ్చరించారు. ఎవరెవరు ఏం చేస్తున్నారన్న

# సర్వేయర్లకు నియామక పత్రాలు పంపిణీ

హైదరాబాద్, అక్టోబర్ 19: శిక్షణ పొందిన సర్వేయర్లకు తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ(ఆదివారం) నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గత కేసీఆర్ ప్రభుత్వం మీద సీఎం విమర్శలు గుప్పించారు. తెచ్చిన ధరణి చట్టం.. కొందరికి చుట్టంగా మారిందని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. 'ధరణి చట్టాన్ని అడ్డుపెట్టుకుని ఆధిపత్యం చెలాయించాలని చూశారు. గత ప్రభుత్వ ఓటమికి ప్రధాన కారణం ధరణి చట్టమే. అధికారంలోకి రాగానే ధరణి భూతాన్ని వదిలించాం. భూ సమస్యలు పరిష్కరించాలనే లైసెన్స్ సర్వేయర్లను తీసుకొచ్చాం. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదు.. ఇచ్చినా పరీక్షలు పెట్టలేదు. ఒకవేళ పరీక్షలు పెట్టినా ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవి. గత ప్రభుత్వ హయాంలో పునరావాస కేంద్రంగా ఉండేది. అధికారంలో రాగానే ని ప్రక్షాళన చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 60వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. మేం ఉద్యోగాలు ఇస్తుంటే.. కోర్టుల్లో కేసులు వేసి ఆపాలని చూశారు. కోర్టుల్లో పోరాడి అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశాం' అని సీఎం రేవంత్ తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చిన ధరణి చట్టం కొంత మంది దొరలకే చుట్టంగా మారిందన్న రేవంత్ రెడ్డి.. అందుకే ప్రతీ ఒక్క సర్వేయర్ బాధ్యతగా పని చేయాలంటూ సీఎం సూచించారు. 'ధరణి భూతాన్ని పెంచి పోషించి భూమిపై ఆధిపత్యాన్ని చెలాయించాలనుకున్న దొరలకు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. అధికారంలోకి వచ్చాక ధరణి దరిద్రాన్ని వదిలిస్తామని ఆనాడు మేం మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ధరణి భూతం నుంచి విముక్తి కల్పించాం. పదేళ్లుగా ఉద్యోగ నియామకాలపై గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టి నిరుద్యోగుల కళ్లల్లో ఆనందం చూస్తున్నాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఆ దిశగా ముందుకెళ్లేందుకు మీ సహకారం ఉండాలి. రైతే దేశానికి వెన్నెముక.. అలాంటి రైతుకు అండగా ఉండండి. తెలంగాణ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి' అని సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా ఎంపికైన సర్వేయర్లకు దిశానిర్దేశం చేశారు.

# అంగన్వాడి ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక





కొడకండ్ల (నమస్తే హైదరాబాద్ ): కొడకండ్ల మండలం రైతు వేదికలో సిఐటియు అంగన్వాడి మైబూబఅలీ అంగన్వాడి రామతార ఆధ్వర్యంలో ఆదివారం పాలకుర్తి మండల సిఐటియు యూనియన్ ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్షురాలుగా బిక్షమమ్మ ఎంపికయ్యారు. కొడకండ్ల మండల కోశాధికారిగా పద్మ,దేవరుప్పుల మండల కార్యదర్శిగా భాగ్యలక్ష్మి నూతన కమిటీని ఎన్నుకోవడ జరిగింది.

## వజ్రేష్ యాదవ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ యాకూబ్, మహమ్మద్ అబ్దుల్




మేడిపల్లి (నమస్తే హైదరాబాద్) :మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మొహమ్మద్ యాకూబ్, మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, కలిసి వజ్రేష్ యాదవ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అమ్మ ఆసరా ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయురారోగ్యాలతో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



## పోలీస్ శాఖ తరపున దీపావళి శుభాకాంక్షలు

**బాణసంచా పేల్చి సమయంలో జాగ్రత్తలు పాటించాలి**
**అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ క్రాకర్స్ అమ్మవద్దు.**
**ఎస్పి నరసింహ ఐపిఎస్, సూర్యాపేట జిల్లా**




**తిరుమలగిరి, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్ (ప్రతినిధి):** దీపావళి పండుగ పురస్కరించుకొని జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున పండగ శుభాకాంక్షలు తెలుపుతున్నాను సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ అన్నారు. ప్రజలు సంతోషంగా ఉత్సవాలు జరుపుకోవాలని సంప్రదాయ పండుగలు అందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని కోరారు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బందులకు గురి చేయొద్దని, మహిళలను గౌరవించాలని తెలిపారు. అధికారుల అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ బాణాసంచా విక్రయాలు చేయవద్దు అని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర సంఘటనలను నివారించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు. బాణాసంచా తయారీదారులు, సరఫరాదారులు, విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా ప్రజలందరూ కలిసిమెలిసి ప్రమాదాలకు దూరంగా ఉంటూ ఉత్సవాలు సురక్షితంగా, శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు


# పత్తి పంట పండించిన రైతు సోదరులు తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యెల్సొజు చామంతి నరేష్**



**తిరుమలగిరి అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్ (ప్రతినిధి):** సిసిఐ కొనుగోలు కేంద్రంలో పత్తి పంటను అమ్ముకునే రైతు సోదరులు ముందుగా మీ మీ ప్రాంత వ్యవసాయ అధికారుల వద్ద సంప్రదించి పత్తి రైతు నమోదు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆ తర్వాత మీ వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్లలో కాపా కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చూసుకుంటే అందుబాటులో ఉన్న జీన్నింగ్ మిల్లు లో అమ్ముకునే అవకాశం ఉంది ,లేదా మీకు దగ్గరలో ఉన్న మార్కెట్ కమిటీ పరిధిలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో సంప్రదించి రైతులు స్లాట్ బుక్ చేసుకొని ,మీకు దెగ్గర లో ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ద్వారా పత్తి పంటను విక్రయించగలరు.
కావున పత్తి పంట పండించిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పత్రికా సమావేశంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యెల్సొజు చామంతి నరేష్ కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ లు రాపాక సోమేశ్ అంగొతు రాములు దొడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎఫ్ సి నగర్ లో బేకరీ ప్రారంభించిన మాజీ కౌన్సిలర్ రమాదేవి



**ఘట్కేసర్, అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్):** మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ ఎఫ్ సి నగర్ కెవి స్కూల్ ఎదురుగా ఏర్పాటుచేసిన నూతన బేకరీ నీ మాజీ కౌన్సిలర్ కోమ్మగొని మహిపాల్ రమాదేవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు రమాదేవి మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులు తెచ్చి వినియోగదారులకు ఇవ్వాలని, ప్రజలందరూ ఈ బేకరీ ని ఉపయోగించుకోవాలని అన్నారు.

# వజ్రేష్ యాదవ్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వినోద్



**పోచారం ,అక్టోబర్ 19 (నమస్తే హైదరాబాద్)**మేడ్చల్ జిల్లా, ఘాట్ కేసర్ మండల్, పోచారం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ కుమార్ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.తన అడుగుజాడల్లో మేము ఎప్పుడూ ఉండి మా వంతు సహాయం చేస్తామని అన్నారు.

# బిల్లులు రాక ఇబ్బందులు తీవ్ర ఒత్తిడిలో హాస్టల్ వార్డెన్లు

**నమస్తే హైదరాబాద్ :** జిల్లాలోని వివిధ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు ఆరునెలలుగా బిల్లులు మంజూరుకావడం లేదు. దీంతో వార్డెన్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. హాస్టళ్లలో రికార్డుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు వాస్తవసంఖ్య సరిపోకపోవడంతో బిల్లులు మంజూరు చేయ డం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వవసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు చేసేందుకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడానికి వార్డెన్లు ముందుగా తమ డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది. అనంతరం బడ్జెట్ మం జూరుకోసం పైఅధికారికి ప్రతిపాదిస్తారు. దాన్ని ఆ అధికారి జిల్లాస్థాయి ఉన్నతాధికారికి పంపడం ద్వారా బిల్లులు మం జూరు చేయాల్సి ఉంటుంది. రెండురోజుల క్రితం లక్షెట్టిపేట సోషల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం వార్డెన్ రాజగోపాల్ ఆత్మహత్యాయత్నం చేశారు. అధికారుల వేధిం పులు, బిల్లులు రాకపోవడంతోనే ఆయన ఆత్మహత్యాయత్నం చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.ఈ సంవత్సరం లక్షెట్టిపేట హాస్టల్లో విద్యార్థుల సంఖ్య 250కి పెరిగింది. ఈ విషయమై తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని ఓ అధికారి బిల్లులు మంజూ రు చేయలేదని తెలిసింది. సదరు అధికారి వి??ధులకు సక్రమంగా హాజరుకావడంలేదని పీడీఎస్యూ ఆధ్వర్యంలో ఈనెల 16రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 17న సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్షితిజకు ఫిర్యాదు చేశారు.

ఆందోళనకరంగా వార్డెన్ ఆరోగ్యం...

ఈ నెల 18న యాసిడ్‌తాగి ఆత్మహత్యాయత్నం చేసిన లక్షెట్టిపేట ఎస్సీహాస్టల్ వార్డెన్ రాజగోపాల్ ఆరోగ్యం ఆందో ళనకంగా ఉంది. ప్రస్తుతం ఆయన నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్...

రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టళ్లకు ఆరు నెలలుగా బిల్లులు మంజూరు కావడం లేదు. జిల్లాలో 25 ఎస్సీ, 15 బీసీ, 35 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. వీరికి మెనూ అమలు చేసేందుకు రోజుకు ఒక్కొక్కరికి పోస్ట్ మెట్రిక్ వారికి రూ. 70, ప్రీ మెట్రిక్ వారికి రూ. 51 ఖర్చు అవుతోంది. ఈ ఖర్చులన్నీ ప్రస్తుతం వార్డెన్లు వెచ్చిస్తున్నారు. ఆరు నెలలుగా బిల్లులు విడుదల కాలేదు. దీంతో అప్పులు తెచ్చి మరీ హాస్టళ్లను



నడిపించాల్సి వస్తోందని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ జరుపుతాం...

లక్షెట్టిపేట ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ రాజగోపాల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విషయం ఇతర వార్డెన్ల ద్వారా తెలిసిందని సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. రాజగోపాల్ ప్రస్తుతం నిర్మల్‌లో చికిత్స పొందుతున్నందున ఆయన్ను కలుస్తా నని తెలిపారు. వార్డెన్‌తో మాట్లాడిన తరువాత వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉందన్నారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ప్రజాస్వామ్యం గురించి ఉపన్యాసాలిస్తూ మావోయిస్టులతో సంబంధాలా?

**నమస్తే హైదరాబాద్ :** ఒకవైపు ప్రజాస్వామ్యం గురించి వేదికలపై ఉపన్యాసాలిస్తూ మరోవైపు మావోయిస్టులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న తెలంగాణ ప్రజాప్రతినిధులు తక్షణం ఆ సంబంధాలను తెంచుకోవాలని, లేని పక్షంలో సదరు ప్రజాప్రతినిధుల వివరాలు వెల్లడించక తప్పదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో, హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం మావోయిస్టుల నిర్మూలనకే పరిమితం కావడం లేదని, అవినీతి, నేరాలు, తీవ్రవాద సంబంధాల నెట్‌వర్క్‌ను సైతం వెలికితీస్తున్నాయని చెప్పారు. కొంతమంది నక్సల్స్ తెలంగాణ ప్రజాప్రతినిధులకు విధేయులుగా వ్యవహరిస్తున్నారంటూ మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజాప్రతినిధులకు సంజయ్ హెచ్చరిక జారీ చేశారు. ఇదిలా ఉండగా, బండి సంజయ్ ఢిల్లీలో తన శాఖ కార్యాలయాన్ని 'కర్తవ్య భవన్' లోకి మార్చారు. దీపావళి సందర్భంగా సంజయ్ ఆదివారం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య తన చాంబర్‌లోకి అడుగుపెట్టారు.



# బహుజన రాజ్యాధికార స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలే : కొత్తగట్టు మల్లన్న



**తిరుమలగిరి అక్టోబర్ 19 నమస్తే హైదరాబాద్ ప్రతినిధి** తిరుమలగిరి మండల కేంద్రంలో పూలే అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్, ఉమ్మడి నల్గొండ జిల్లా ఉద్యమాల ఉపాధ్యాయులు కొత్తగట్టు మల్లన్న చేత ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. విగ్రహావిష్కరణ తర్వాత ఆయన మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ లందరూ విద్య ఆర్థిక రాజకీయ రంగాలలో ముందుకు వెళ్లాలని 18 వ శతాబ్దంలోనే కృషిచేసి బడుగు బలహీన వర్గాలకు మరీ ముఖ్యంగా అట్టడుగున వర్గాలకు,మహిళలకు విద్యను అందిస్తేనే వారు చైతన్యవంతమై ఆత్మగౌరవంతో ముందుకెళ్తారని పూలే గారి సతీమణి సావిత్రిబాయి పూలే చదువు నేర్పి భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమెను తీర్చిదిద్ది శూద్రులకు, అతిశూద్రులకు చదువును నేర్పే కార్యక్రమాన్ని రూపొందించి అనేక రకాల సంఘ సంస్కరణలు తీసుకొచ్చి ఈరోజు మనం ఇంత చైతన్యం అయ్యేలా మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిన గొప్ప మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు. ఆయన ఆశయాలు మనం పునికి పుచ్చుకోవాలని ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో సామాజిక ఉద్యమ కారులు, మహిళా నాయకురాలు శ్రీమతి కొత్తగట్టు లలితమ్మ-మల్లన్న , బీసీ సంఘం నాయకులు కడెం మల్లయ్య యాదవ్, సామాజిక ఉద్యమ నాయకులు కందుకూరి ప్రవీణ్, చేను శ్రీనివాస్, ఎండి కాసిం, బుసిపాక ఉదయ్ కుమార్, తన్నీరు రాంప్రభూ, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, మాజీ కౌన్సిలర్ ఎల్సోజి నరేష్, రజక సంఘం నాయకులు పులిమామిడి సోమన్న, బిక్షం, వెంకన్న, వడ్డెర సంఘం నాయకులు ముద్దంగుల యాదగిరి, రూపాని వెంకన్న,పద్మశాలి సంఘం నాయకులు చింతకింద మురళి, సోమనారాయణ, తుమ్మ చంద్రమౌళి, ఎల్లంల యాదగిరి, బలిజ సంఘం నాయకులు సోమరాజు, వంగరి బ్రహ్మం, గంట యాకూబ్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వై దీన్ దయాల్, ఏమోజు రవీంద్ర చారి, కృష్ణ చారి, మైనార్టీ సంఘం నాయకులు ఎండీ షకీల్ పాషా, రషీద్, గౌడ సంఘం నాయకులు గిలకత్తుల రాము గౌడ్,రామ్మూర్తి గౌడ్, లంబాడి సంఘం నాయకులు ఠాకూర్ నాయక్, భూక్య విజయ నాయక్, కిస్తూ నాయక్, శ్రీను నాయక్, యాదవ సంఘం నాయకులు పయ్యముల వెంకన్న యాదవ్, పనికెర యాదగిరి, కందుకూరి లక్ష్మయ్య, మున్నూరు కాపు సంఘం నాయకులు పసునూరి శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు జంపాల రాజు, వినయ్, వంగాల దానయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఔటర్ రింగ్ రోడ్ దగ్గరలో ఎడ్ల బండి చక్రాలు దొంగతనం చేసిన దుండగలు



**కాజీపేట్ అక్టోబర్ 19 నమస్తే హైదరాబాద్** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ గ్రామంలో ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర వ్యవసాయ బావి దగ్గర రాత్రి వ్యవసాయం చేసుకునే బావి దగ్గర రైతు పొలం తడవకుండా రూము ఏర్పాటు చేసుకొని అక్కడ బండి పెట్టడం జరిగింది నిన్నటి రోజున మూడు ఎడ్ల బండిల చక్రాలు దొంగలించడం ఒక బండి భోగి మధు మరొక్క బండి మీనుగు సతీష్ సుమారు వాటి యొక్క విలువ 40,000 వరకు ఉంటుందని రైతులు అంటున్నారు
దుండగులను పట్టుకోవాలని మడికొండ రైతులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు



# రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి కళాశాలలో నిర్వహించిన హోమియోపతి ఎక్స్ పో-2025 కు విశేష స్పందన







**ఉప్పల్, అక్టోబరు 19( నమస్తే హైదరాబాద్):** రామంతాపూర్ హోమియోపతి కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన హోమియోపతి ఎక్స్ పో- 2025 కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని అయూష్ అడిషనల్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ డా. లింగరాజు, వైస్ ప్రిన్సిపల్ డా. న్సిపల్ డా. శ్రీనివాస్ రెడ్డి, డా. కె. కృష్ణమూర్తి, ప్రోగ్రాం ఇంచార్జీ డా.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా. లింగరాజు మాట్లాడుతూ హోమియోపతి వైద్య విధానాన్ని ప్రజలల్లోకి తీసుకుని వెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నేటి నుంచి రెండు రోజులపాట పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య శిక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు, వివిధ వనరుల నుంచి మందులు ఎలా తయారు చేస్తారనే విషయంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలతోపాటు, కళాశాలలోని హెచ్ఐవి పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరీక్షల గురించి వివరిస్తామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. హోమియోపతి కళాశాలలో సుమారు 80 పడకల ఆసుపత్రి ఉందని, వివిధ రోగాలకు ఉచితంగా మందులు అందజ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలను వివిధ పాఠశాలల విద్యార్థులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. మానవ శరీరంలో ఉన్న అవయవాలను తెలిపే విధంగా ప్రదర్శనలు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 4 వేల మంది విద్యార్థులు ప్రదర్శనలు తిలకించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్న రేగళ్ల సతీష్ రెడ్డి

## - పూజారి, అర్చకుల ఆశీర్వాదం తీసుకున్న రేగళ్ల సతీష్ రెడ్డి



**ఉప్పల్ అక్టోబర్ 19 ( నమస్తే హైదరాబాద్):** బిఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు ,సాయిమల అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ రేగళ్ళ సతీష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రధాన మేల్ శాంతి (పూజారి) శ్రీ శ్రీ శ్రీ... ఎస్ అరుణ్ కుమార్ నంబూద్రి, మాలికాపురోత్తమ దేవి ఆలయ ప్రధాన అర్చకులు మెయిల్ శాంతి టీ. వాసుదేవన్ నంబూద్రి దివ్యమైన ఆశీస్సులతో వారు సతీష్ రెడ్డి ని శాలువతో సన్మానం చేసి దీవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గురుస్వామి బాలానగర్ గనుసాల జంగయ్య, గురు స్వామి, సురేష్ నేత, రాజశేఖర్ రెడ్డి తదితరులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు.



# భరత్ నగర్ బురుజు గల్లి లో రూ.92లక్షలు తో జరుగుతున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్, అక్టోబర్ 19 ( నమస్తే హైదరాబాద్):** ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టుగా కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ డివిజన్ భరత్ నగర్ బురుజు గల్లి లో రూ. 92 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మాణాలను పనులను ఆదివారం కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు.
డివిజన్ లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి చెప్పారు.
ఉప్పల్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్ కుమార్, సల్లా ప్రభాకర్ రెడ్డి,పాలడుగు లక్ష్మణ్ ,యేరా శ్రీనివాస్ ,,సోమ బాలమణి,మోత్కూరి శ్రీహిత్ బాబీ ,జిత్తు రెడ్డి , కొత్త వంశీ , మేకల రామ్ రెడ్డి ,మేకల మధుసూదన్ రెడ్డి ,పిన్నిటి భూపాల్ రెడ్డి , కొత్త మలేష్ గౌడ్ , ధర్మ రెడ్డి ,దశరత్ కురుమ ,తమ్మాలి రాజు ,తమ్మాలి కిషోర్ ,పుల్ల ప్రభాకర్ , గొండి ప్రశాంత్ రెడ్డి , సుడుగు నవీన్ రెడ్డి ,ముత్తంగరి రామ్ , హరి యాదవ్ ,సోమ మలేష్ ,అడపా గౌతమ్ , బజార్ నవీన్ గౌడ్ , టైసిన్ ,బురుజు రవి , కేమిడి ఇంద్ర,తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన ఉప్పల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 19( నమస్తే హైదరాబాద్):** తెలంగాణ రాష్ట్ర పీ. సీ. సీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని ఉప్పల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్ , రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తవిడబోయిన గిరిబాబు లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ శివారెడ్డిని పార్టీపరమైన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్ , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వబ్రాహ్మణ సంఘము గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు పబ్భోజు బిక్షపతి చారి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఎస్ కాలువకు లీకేజీ రోడ్డుపైకి చేరిన సాగునీరు



మానవపాడు, అక్టోబరు 19 ఆర్డీఎస్ కాలువకు సాగునీరు రావడంతో రై తులు సంతోషానికి బదులు ఇబ్బందిపడుతున్నారు. డీ-30 కాలువకు లీకేజీలు ఏర్పడ డంతో ఈ కాల్వకు వదిలిన సాగునీరంతా వృ థా అవుతున్నది. అలాగే రోడ్లపైకి కూడా చే రుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. మండల పరిధిలోని నారాయణపురం వెళ్లే రోడ్డు వద్ద లీకేజీ అధికంగా ఉండటంతో రోడ్డుపైకి నీరు చేరి, గ్రామంలో నుంచి వాగులోకి పారుతున్నాయి. గత ఏడాది నుంచి డీ-30 కాలువలో జమ్ము పేరుకుపోవడం వ ల్ల ఈపరిస్థితి ఏర్పడింది. తొలగించడం గు రించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏవి ధంగా మారుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు స్పందించి కాలువలో చెత్తాచెదారం, జమ్ము తొలగించేందుకు చర్యలు తీసుకోవాల ని కోరుతున్నారు.

# ఉప్పల్ ట్రస్మా ప్రెసిడెంట్ బాణాల విజేయందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల వేడుక










**ఉప్పల్, అక్టోబర్ 19 ( నమస్తే హైదరాబాద్):** ట్రస్మా ఉప్పల్ మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ట్రస్మా ఉప్పల్ మండలంలోని 110 ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జ్ఞాపికల ద్వారా వారిని సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెగా, ఒమేగా గ్రూప్స్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మాలతి రెడ్డి లు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలు వారు చేసే నిరంతర కృషి అని కొనియాడారు.గురువుని నమ్ముకుంటే జీవితంలో ఉన్నత స్థాయిలో ఉంటామని వారు ఈ స్థాయిలో ఉండటానికి తమ గురువుల కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల ట్రస్మా ప్రెసిడెంట్ బాణాల విజేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును రూపుదిద్దే టీచర్లు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధ్యమవుతుందని ప్రైవేట్ స్కూల్లో పనిచేసే టీచర్లకు ఆరోగ్య సమస్యల దృష్ట్యా ఎలాంటి సమస్యలు తలెత్తిన హెల్త్ కార్డు, ఇన్సూరెన్సుల తో సంబంధం లేకుండా పెద్ద హాస్పిటల్లో ఖర్చుకు భయపడి వెనకడుగు వేసే టీచర్లకు మన ట్రస్మా భరోసాగా ఉంటుందని తక్కువ ఖర్చు ద్వారా పెద్ద సమస్యలు కూడా పరిష్కరి%శీ%చడానికి టి. ఎక్స్. హాస్పిటల్స్ సిఇఒ డా. కిశోర్ గారు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి యాదగిరి , ట్రస్మా మేడ్చల్ మల్కాజ్గిరి ప్రెసిడెంట్ నాగరాజు , ఉప్పల్ మండల ఎంఈఓ పి రామారావు , ట్రస్మా ఉప్పల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ , ఉప్పల్ ట్రస్మా జనరల్ సెక్రటరీ లక్ష్మీ దేవమ్మ , ట్రస్మా స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ మదర్ , ట్రస్మా డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ సతీష్ , ఉప్పల్ ట్రస్మా ఎక్స్ ప్రెసిడెంట్ దన్ సాగర్ , రాజు ఎల్, చందన, రాజు కె, ఇస్మాయిల్, అల్తాఫ్,పాఠశాల కరెస్పాండంట్స్, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వజ్రేష్ యాదవ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మహమ్మద్ యాకూబ్, మహమ్మద్ అబ్దుల్




**మేడిపల్లి (నమస్తే హైదరాబాద్)** :మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మొహమ్మద్ యాకూబ్, మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్, కలిసి వజ్రేష్ యాదవ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అమ్మ ఆసరా ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయురారోగ్యాలతో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.



# మెగా జాబ్ మేళా పై విస్తృత ప్రచారం కల్పించండి.

**ఎక్కువ మంది నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకునేలా ఫ్లెక్సీ బ్యానర్లు,హోర్డింగులు,గోడపత్రికలు ఏర్పాటు చేయండి.**

**మెగా జాబ్ మేళా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఒక గొప్ప అవకాశం-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**నమస్తే హైదరాబాద్ :** ఈనెల 25న సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు, ఆదివారం ఆయన మెగా జాబ్ మేళా నిర్వహణపై అదనపు కలెక్టర్ కె. సీతారామారావు తో కలిసి సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి,కోదాడ ఎం ఎల్ ఏ ఉత్తమ్ పద్మావతి లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ నెల 25 న హుజూర్నగర్ లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ ( సబ్ రిజిస్టర్ కార్యాలయం వెనక) లో ఉదయం 8 గంటలనుండి జాబ్ మేళా ను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.ఈ జాబ్ మేళాకు రాష్ట్రంలోని 150 పెద్ద, పెద్ద కంపెనీలు రానున్నాయని, 5000 వరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని ఆయన వెల్లడించారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్ సి,ఇంటర్,డిగ్రీ,పి జి,ఐటి ఐ,డిప్లొమా,ఎం బి ఏ,బి టెక్,ఫార్మసీ,తదితర కోర్సులలో ఉత్తీర్ణత కలిగిన, 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ యువత అర్హులని వివరించారు. అందువల్ల ఈ జాబ్ మేళాలను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఇందుకుగాను ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు, కరపత్రాలను పెద్ద ఎత్తున ముద్రించాలని , అన్ని పట్టణాలలో జన సమ్మర్థం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేయాలని, గోడపత్రికలను బస్సులు కళాశాలల వద్ద అతికించాలని చెప్పారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, జాబ్ మేళా నిర్వహించనున్న పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ పక్కనే ఉన్న స్వర్ణ వేదిక ఫంక్షన్ హాలులో ఉదయం అల్పాహారం మొదలుకొని, మధ్యాహ్న భోజనము, అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు .నిరుద్యోగ యువత జాబ్ మేళాకు వచ్చి ఉద్యోగాలు పొందే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, జాబ్ మేళా హాజరయ్యే వారు 5 సెట్ల రెజ్యూమ్ తో పాటు , ఇటీవలి కాలంలో తీసుకున్న రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో సహా హాజరుకావాలని కోరారు. నిరుద్యోగ యువత ఉన్న చోటు నుండే క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చుని స్పష్టం చేశారు.జాబ్ మేళా నిర్వహణపై ఈ నెల 22 న రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఉదయం 11 గంటలకు సూర్యాపేటలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపాల్ లు, తదితరులతో సమావేశం నిర్వహించనున్నారని,, అందువల్ల ఈ సమావేశానికి ప్రిన్సిపల్స్ అందరూ హాజరుకావాలని, సూర్యపేట తో పాటు, నల్గొండ ,యాదాద్రి భువనగిరి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులతో సమన్వయం చేసుకొని అందరు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు జాబ్ మేళా నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ,ప్రత్యేకించి వారి పరిధిలోని అన్ని కూడళ్ళు, బస్టాండ్లు ,జన సమర్థం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఫ్లెక్సీలు, హోర్డింగ్ లు ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని బస్సులకు పోస్టర్లు అతికించేలా చూడాలని, ఆర్టీసీని రీజినల్ మేనేజర్ ను ఆదేశించారు.

అదనపు కలెక్టర్ కె. సీతారామారావు ,ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్డిఓ, జిల్లా పరిశ్రమల మేనేజర్, జిల్లా ఇంటర్ వైద్యాధికారి,జిల్లా విద్యాశాఖ అధికారి,జిల్లా ఉపాధి కల్పనాధికారి, ఆర్ టి సి ఆర్ ఎం, తదితరులు, హాజరయ్యారు.

# దీపావళి వేళ వ్యాపారులకు సీఎం చంద్రబాబు గుడ్‌న్యూస్



**నమస్తే హైదరాబాద్ :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్ లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండిలా పరుగులు పెడుతున్నాయి. ముఖ్యంగా పరిశ్రమలను, వ్యాపారాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుడటంతో ఏపీ అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఇప్పటికే ప్రజలకు, వ్యాపారస్తులకు జీఎస్టీ తగ్గించి భారీ ఉపశమనం కలిగింది. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ భారీగా విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలను రాష్ట్రానికి తెప్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల గూగుల్ సెంటర్ విశాఖలో ఏర్పాటుకు ప్రభుత్వం, గూగుల్ ప్రతినిధుల మధ్య ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఇలా రాష్ట్రాభివృద్ధియువతకు ఉద్యోగాల కల్పన కోసం కూటమి ప్రభుత్వం పారిశ్రామిక రంగంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా దీపావళి పండగ వేళ వ్యాపారులు సీఎం చంద్రబాబు నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. పరిశ్రమలకు మద్దతుగా, వ్యాపారాలకు ఏపీని గమ్యస్థానంగా నిలిపేందుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం తెలిపారు. పరిశ్రమలకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. తొలి విడతగా రూ.1,500 కోట్ల పారిశ్రామిక రాయితీల విడుదల చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏపీ ప్రగతిలో భాగస్వాములైన పారిశ్రామికవేత్తలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు వెల్లడించారు.

చంద్రబాబు సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో చిన్న, మధ్య తరహా వ్యాపారులకు భారీ ఊరట లభించింది. పేదలకు సంక్షేమ పథకాలు, పెట్టుబడులతో ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక చెల్లింపులు, వ్యాపారస్తులకు ప్రోత్సాహకాలు అందిస్తూ అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వ్యాపార నిపుణులు చెబుతున్నారు.

# ఉద్యోగులకు దీపావళి ధమాకా..



**నమస్తే హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. ఉద్యోగులకు ఒక విడత డీఏ (కరువు భత్యం) విడుదల చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నవంబరు నుంచి ఉద్యోగుల ఖాతాల్లో డీఏ సొమ్ము జమ అవుతుందని తెలిపారు. దీనికిగాను నెలవారీగా రూ.160 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం మంత్రివర్గ ఉప సంఘ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఆ తర్వాత రాత్రి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో భేటీ అయ్యారు. ఒక విడత డీఏతో సహా అనేక నిర్ణయాలను స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి ఆర్థిక వెసులుబాటు రాగానే పీఆర్సీని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పోలీసులకు ఒక విడత ఈఎల్స్(ఆర్జిత సెలవులు) ఇస్తామని, దీన్ని రెండుసార్లుగా నవంబరులో రూ.105 కోట్లు, జనవరిలో రూ.105 కోట్లు చెల్లిస్తామని సీఎం చెప్పారు. ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్న హెల్త్‌కార్డు సేవలను 60 రోజుల్లో వారి అవసరాలకు తగినట్టుగా మెరుగుపరుస్తామని తెలిపారు. అలాగే, 180 రోజుల చిన్నారుల సంక్షరణ సెలవుల(చైల్డ్‌కేర్ లీవు)ను వారు రిటైర్ అయ్యేలోగా ఎప్పుడైనా వాడుకోవచ్చని వెల్లడించారు.ఉద్యోగ సంఘాల కార్యాలయాలకు ఒకప్పుడు ఆస్తిపన్నుకి మినహాయింపు ఇచ్చామని, తర్వాత మునిసిపాలిటీల్లో ఆస్తి పన్ను కట్టాలంటూ వారికి జరిమానాల మీద జరిమానాలు వేశారని చెప్పారు. ఇప్పుడు వాటన్నింటినీ రద్దు చేస్తున్నామని, ఇకపై ఆస్తిపన్ను కట్టాల్సిన అవసరం లేకుండా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫ్యాన్, వాచ్‌మెన్, అటెండర్, జూనియర్ అసిస్టెంట్, ప్లంబర్ విధులు నిర్వహించే ఉద్యోగాల పేర్లు గౌరవప్రదంగా మార్చుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. 2004కి ముందు ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా భర్తీ అయి, ఉద్యోగాల్లోకి వచ్చిన వారికి ఓపీఎస్ వర్తించేలా సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం అమలుచేసేందుకు మంత్రి వర్గ ఉపసంఘం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల ఇతర సమస్యలపై కూడా ఈ కమిటీ ఎప్పటికప్పుడు చర్చించి సరైన నిర్ణయాలు తీసుకుంటుందని వెల్లడించారు. కాగా, పోలీసులకు 4 విడతల సరెండర్ లీవుల సొమ్ము చెల్లించాలి. ఒక్కొక్క విడతకు దాదాపు రూ.210 కోట్ల చొప్పున మొత్తం రూ.835 కోట్లు ఉంటుందని ముఖ్యమంత్రి వివరించారు.

**ఇతర రాష్ట్రాల్లో తగ్గిస్తున్నారు!**

దక్షిణాది రాష్ట్రాలన్నీ తమ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, ఇతర నిర్వహణ ఖర్చులు తగ్గించుకుంటూ, వాటిని మూలధనంగా ఖర్చు చేస్తూ ఆదాయం స ంపాదిస్తున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. కానీ, రాష్ట్రంలో పరిస్థితులు భిన్నంగా ఉనాయన్నారు. ఈ విషయం ప్రతి ఉద్యోగికీ, ప్రజలకు అర్థం కావాలన్నారు. "దాపరికం లేదు. ప్రజల పక్షాన ట్రస్టీగా పనిచేస్తున్నాం. ఎక్కడా ఎవరినీ కించపరచడం లేదు. 2024-25లో మనరాష్ట్రం సొంత ఆదాయంలో జీతాలు, పెన్షన్లు, ఇతర నిర్వహణ ఖర్చులు 93 శాతానికి చేరా యి. 2025-26లో 93.5 శాతం ఉన్నాయి. 2024-2 5లో రూ.51,462 కోట్లు, 2025-26లో రూ.51,202 కోట్లు మానవ వనరుల(హెచ్ఆర్)కు ఖర్చు పెడుతున్నాం. కానీ, 2020-21లో తమిళనాడు 63 శాతం ఉన్న హెచ్ఆర్ ఖర్చును ఇప్పుడు 42 శాతానికి, కేరళ 106 శాతం నుంచి 68 శాతానికి, కర్ణాటక 49 శాతం నుంచి 38 శాతానికి, తెలంగాణ 58 శాతం నుంచి 38 శాతానికి తగ్గించుకున్నాయి. ఏపీలో మాత్రం పరిస్థితులు రివర్స్‌లో ఉన్నాయి. జీఎసడబ్ల్యూఎస్ వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదు. ఆప్కాస్, ఆర్టీసీ అన్ని కలిపి రూ. 10,0 00 కోట్ల అదనపు ఖర్చు వచ్చి చేరింది. ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగలేదు. 94 కేంద్ర ప్రాయోజిత పథకాలకు వైసీపీ హయాంలో డబ్బులివ్వలేదు.

# పేలుతున్న టపాసుల ధరలు

**గత ఏడాదితోపోలిస్తే 10-20 శాతం అధికం**

**వర్షంతో సాయంత్రం వరకు మందకొడిగా కొనుగోళ్లు**

**రాత్రి తరువాత ఊపందుకున్న అమ్మకాలు**



**నమస్తే హైదరాబాద్ :** దీపావళి పండగ సందర్భంగా జిల్లాలో బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా శాఖల అధికారుల అనుమతుల మేరకు అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట పట్టణాలతోపాటు అన్ని మండల కేంద్రాల్లో నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా విక్రయ దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలుచోట్ల దఫదఫాలుగా వర్షం పడడం, సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతంగా వుండడంతో అమ్మకాలు మందకొడిగా సాగాయి. రాత్రి ఏడు గంటల నుంచి దుకాణాల వద్ద క్రమేపీ రద్దు పెరిగి, బాణసంచా విక్రయాలు ఊపందుకున్నాయి. ఎప్పటి మాదిరిగానే ధరలు మండిపోతున్నాయని, గత ఏడాదితో పోలిస్తే పది నుంచి 20 శాతం వరకు పెరిగాయని అంటున్నారు. గత ఏడాది కాకర పువ్వొత్తులు (రంగులు) పది ప్యాకెట్లు రూ.300లకు లభించగా ఈసారి బ్రాండ్‌నుబట్టి రూ.350 నుంచి రూ.400లకు అమ్ముతున్నారు. సాధారణ కాకర పువ్వొత్తులు రూ.150 నుంచి రూ.200కి, భూచక్రాల బాక్స్ రూ.150 నుంచి రూ.200లకు పెరిగాయి. ప్రస్తుతం రూ. 200లకు అమ్ముతున్నారని చెబుతున్నారు. సోమవారం వర్షం లేకపోతే అమ్మకాలు బాగుంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యాపారులకు దీపావళి ధమాకా!

**గత ఏడాదితో పోలిస్తే పెరిగిన అమ్మకాలు**

**వర్షాలు లేకపోవడంతో ఫుల్ జోష్**

**ధరలు పెరిగినా కనిపించని ప్రభావం**



**నమస్తే హైదరాబాద్ :** దీపావళి నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నగర పరిధిలోని ఏయూ, ఆల్వార్‌దాస్ మైదానాలతోపాటు మధురవాడ, ఎన్ఏడీ, గాజువాక ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 530 మందికి అధికారులు బాణసంచా విక్రయాలకు లైసెన్సులు మంజూరుచేశారు. కొన్నిచోట్ల వీ?ధుల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. గత ఏడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం అమ్మకాలు పెరిగినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది దీపావళికి ముం దు వర్షాలు కురవడంతో అమ్మకాలపై ప్రభావం పడింది. ఈ ఏడాది వర్షం లేకపోవడం వ్యాపారులకు కలిసి వచ్చింది. సోమవారం కూడా వర్షం లేకపోతే స్టాక్ క్లియర్ చేసేస్తామని చెబుతున్నారు. ఇక ధరలు ఐదు నుంచి పది శాతం పెరిగాయి. అయితే అమ్మకాలపై పెద్దగా ప్రభావం పడలేదంటున్నారు.

ప్రత్యేక ఆఫర్లు

నగర పరిధిలో బాణసంచా విక్రయిస్తున్న వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. 40, 50, 60 శాతం తగ్గింపు అంటూ ఆకట్టుకునే ప్రయ త్నం చేస్తున్నారు. ఇదే అదనుగా గత ఏడాది నిల్వలను క్లియర్ చేసుకుంటున్నారు. దీంతో వినియోగదారులు ఎగబడుతున్నారు.

నేడు కీలకం..

ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఆదివారం అమ్మ కాలు భారీగానే సాగాయి. ఇక దీపావళి సందర్భంగా సోమవారంపై వ్యాపారులు భారీ ఆశలు పెట్టుకున్నారు. శని, ఆదివారాల్లో 40 నుంచి 50 శాతం అమ్మకాలు సాగాయి. వర్షం లేకపోతే మంచి వ్యాపారం జరుగుతుందని భావిస్తున్నారు. ఫ్యామిలీ ప్యాక్, స్పెషల్ ప్యాక్‌లను ఎక్కువమంది కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ప్యాక్‌లో 20 నుంచి 50 వరకు ఐటెమ్స్ ఉంటున్నాయి. స్పెషల్ బాక్సు ధర రూ.800 నుంచి రూ.5 వేలు వరకు ఉన్నాయి.

అమ్మకాలు బాగున్నాయి

మూడేళ్లతో పోలిస్తే అమ్మకాలు పెరిగాయి. సోమవారం కూడా వర్షం పడకపోతే 100 శాతం అమ్మకాలు సాగే వీలుంది. ధరలు అందుబాటులో ఉండడంతో ప్రజలు భారీగా వస్తున్నారు. ఆదివారం జిల్లాలో పెద్దఎత్తున విక్రయాలు సాగాయి. చోడవరం, తుని, తణుకు, విజయనగరం నుంచి సరకు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం.

– కె.రాజశేఖర్, వైజాగ్ ఫైర్ వర్కర్స్ డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్


షాపుల వద్ద భారీ రద్దీరెండు, మూడేళ్లతో పోలిస్తే భారీ సంఖ్యలో కొనుగోలు దారులు వచ్చారు. ప్రతి షాపు కిక్కిరిసిపోయింది. గత ఏడాది రూ.3 వేలు సామగ్రి కొన్నాం. ఈ ఏడాది రూ.2500కే ఎక్కువ వచ్చాయి. ధరలు భారీగా పెరిగినట్టు అనిపించలేదు. అవసరమైన మేరకు తీసుకున్నాం.నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండానే బాణసంచా విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏటా దీపావళికి నాలుగైదు రోజులు ముందుగానే బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అనుమతులు జారీచేస్తుంటారు. ఈ ఏడాది పండగ ముందురోజు వరకు అనుమతులు జారీచేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. అనుమతులు లేకపోయినా కొందరు ఏయూ ఇంజనీరింగ్‌మైదానం, ఎంవీపీకాలనీలోని ఏఎస్‌రాజా మైదానం, గాజువాక ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటుచేసేశారు. నిబంధనలు పాటించాలని సీపీ శంఖబ్రతబాగ్చి వారంరోజుల ముందే మార్గదర్శకాలు జారీచేసినా పట్టించుకోలేదు. దుకాణాల మధ్య దూరం, ఇసుక బకెట్లు, నీటిడ్రమ్ములు, అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయలేదు. దీనిని సీపీ సీరియస్‌గా తీసుకుని వాటిని తొలగించేందుకు సన్నద్ధమయ్యారు.

# పండుగ వేళ ఉలికిపాటు! లగేజ్ కిందకు దించే క్రమంలో ఘటన

**పార్సిల్ కార్యాలయం షెడ్ పైభాగం, కిటికీ అద్దాలు ధ్వంసం**

**భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు**

**అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శల వెల్లువ**



**నమస్తే హైదరాబాద్ :** పార్వతీపురం పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎన్నడూ లేని విధంగా భారీ పేలుడు సంభవించింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గుర య్యారు. వాస్తవంగా మందుగుండు సామగ్రిని బస్సులు, రైళ్లలో పార్సిల్ సర్వీస్ ద్వారా పంపించకూడదు. వాటి వల్ల సంభవించే ప్రమాదం చాలా తీవ్రంగా ఉంటుంది. అయితే ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో ప్రయాణికులు, స్థాని కులు షాక్‌కు గురయ్యారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షతగాత్రుల కుటుంబాల్లో మాత్రం పండుగ సందడి లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే..

పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి ఆదివారం ఉదయం విజయనగరం నుంచి ఓ బస్సు వచ్చింది. దానికి సమీపంలోనే ఉన్న ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం నుంచి ఓ కళాసి వచ్చి.. ఆ బస్సులో సామాన్లు దించేందుకు వెళ్లాడు. మందుగుండు సామగ్రి అని తెలియక లగేజ్ బాక్స్‌ను పార్సిల్ కౌంటర్ వద్దకు తీసుకొచ్చి కిందకు దించగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి పార్సిల్ కౌంటర్ షెడ్ పైభాగం, అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో కళాసి రెడ్డి రమేష్, బస్సు డ్రైవర్ తెర్లి రవి, తోపుడు బండి కార్మికుడు సుందరరావు, మరో వ్యక్తి కె.రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. రవి, ఆర్.రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు, కె.రమేష్‌ను విజయనగరం మహా రాజా ఆసుపత్రికి తరలించారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ డ్రైవర్ రవి మృతి చెందారు. ఆయనది నర్సిపురం గ్రామంగా తెలిసింది. కాగా విజయనగరంలోని పార్సిల్ బుక్ చేసిన వారి ఫోన్ నెంబర్, పార్వతీపురంలోని పార్సిల్ తీసుకునే వారి ఫోన్ నెంబర్ ఒకటే ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్సిల్ పంపిన వ్యక్తి జియ్యమ్మవలస నిమ్మలపాడు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ అని తెలుస్తోంది. 25 కేజీల జనరల్ ఐటమ్ పేరుతో పార్సిల్ బుక్ అయినట్లుగా రశీదు ఉన్నట్లు ఆర్టీసీ కొరియర్ సర్వీసు అధికారులు చెబుతున్నారు. ఎస్పీ మాధవరెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచాను పార్సిల్ ద్వారా పంపించ కూడదన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయనతోపాటు ఎస్పీ జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. అక్కడ వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు కూడా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. సంబంధిత వైద్యులను అప్రమత్తం చేశారు.

మంత్రుల ఆరా పార్వతీపురం, అక్టోబరు 19: జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. సంఘటన ఏ విధంగా జరిగింది. దానికి గల కారణాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# కార్తీకంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు



**నమస్తే హైదరాబాద్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందు లు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పా టు చేసి మాట్లాడారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు రాకు ండా ఎక్కిడికక్కడ వన్‌వే మాదిరి వాహన రాకపోకలు కొనసాగుతాయన్నారు. రద్దీరోజుల్లో ప శ్చిమ రాజగోపురం వద్ద హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి లోపల వ్రతమండపాలు ఖాళీఅయిన తరువాతనే కంపార్టమెంట్‌లలో వేచిఉన్న వారిని లోపలకి పంపుతామని దీని వల్ల తోపులాటలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఈ వో తెలిపారు. కార్తీకమాసంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం తదితర ముఖ్యమైన కార్యక్రమాలను అనుకున్న సమయానికి ప్రారంభిస్తామన్నారు. కార్తీకపౌర్ణమి రోజున (నవంబ రు 5) గిరిప్రదక్షిణ జరగనుందన్నా రు. ఉదయం 8.30కి సత్యదేవుడి పల్లకీలో రత్న,సత్యగిరిలు చుట్టూ ప్రదక్షిణ ఉంటుందని.. భక్తులతో మధ్యాహ్నం రెండుగంటల నుంచి సత్యరథం ప్రారంభమవుతుందని సుమారు 1.50 లక్షల మ ంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి తెప్పోత్సవం నవంబరు 2న జరుగుతుందని, ఆ రోజు సాయంత్రం 5.30కి తులసిధాత్రి పూజను నిర్వహించి రాత్రి 7గంటలకు పంపాసరోవరంలో నౌకావిహారం నిర్వహిస్తామన్నారు. వేడుకలకు సంబంధించి విస్తృతప్రచారం గావించినట్టు ఈవో తెలిపారు. సమావేశంలో ఏఈవోలు కృష్ణారావు, అనకాపల్లి ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

# మూడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి..


**నమస్తే హైదరాబాద్ :** జిల్లాలో పర్యాటకాభివృద్ధికి కంకణం కట్టుకున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం లొద్ద జలపాతానికి వెళ్లారు. అయితే ఇందుకోసం బాగా శ్రమించారు. మూడు కిలోమీటర్లు పైబడి నడిచి కొండలెక్కి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. భారీ వర్షంలో తడుస్తూ జలపాతాన్ని పరిశీలించారు. వాస్తవంగా ఏవోబీ పరిధి సాలూరు మండలం కొదమ పంచాయతీలో లొద్ద బారిబంద జలపాతం ఉంది. సుందరంగా ఉండే ఈ జలపాతానికి చేరుకోవడానికి రోడ్డు నిర్మాణం జరుగుతుంది. కాగా జలపాతం సందర్శించేందుకు పార్వతీపురం నుంచి కారులో మక్కువ మండలం నంద వరకు వెళ్లారు. అక్కడ నుంచి అధికారులతో కలిసి జీపుల్లో లొద్దకు పయనమయ్యారు. వర్షాలకు ఆ మట్టి రోడ్డు పాడవ్వడంతో జీపులను మాసిన వలస దాటిన తర్వాత నిలిపివేశారు. అక్కడి నుంచి కొద్ది దూరం బైక్‌పై కలెక్టర్ పయనమవగా.. అధికారులంతా కాలినడకన వెళ్తుండడంతో ఆయన కూడా నడకబాట పట్టారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్లు నడిచి లొద్ద వద్దకు చేరుకున్నారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనీ ఆరా తీశారు. ఏయే పంటలు పండిస్తున్నారు? ఏ ఆహారం తింటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరుకు హామీ ఇచ్చారు. బందపాయి, చింతామలకు రోడ్డు నిర్మించి, అంబులెన్స్ అందు బాటులో ఉండేటట్టు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. లొద్ద పర్యటనకు వెళ్లిన జిల్లా కలెక్టర్ స్థానిక గిరిజనులు అందించిన రాగి సంకటి, అంబలి, టమాటా చట్నీ తిన్నారు. అనంతరం కలెక్టర్ మరో రెండు కిలోమీటర్లు వరకు నడిచి లొద్ద జలపాతానికి చేరుకున్నారు. అనంతరం జలపాతంలో ఆయన స్నానం చేశారు. ఆ తర్వాత కలెక్టర్ లొద్ద చేరుకుని అధికారులతో సమీక్షించారు. లొద్ద జలపాతం అభివృద్ధికి



తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. లొద్ద జలపాతానికి వెళ్లే మార్గాన్ని స్థానికుల సాయంతో బాగు చేయాలని పీఆర్ డీఈని ఆదేశించారు. చింతచెట్లు, కాగితపు పూల మొక్కలు నాటాలని, జలపాతానికి వెళ్లడానికి సూచిక బోర్డులు పెట్టాలని ఉపాధి ఏపీవో టి.రామకృష్ణకు సూచించారు. గిరిజనులకు రుణాలందించి జలపాతం సమీపంలో దుకాణాలు, చిన్న హోటల్స్ ఏర్పాటు చేయించాలని వెలుగు ఏపీఎం ఎ.జయమ్మను ఆదేశించారు. రోడ్లు అనుమతులు తదితర అంశాలపై డీఎఫ్‌వో ప్రసూనతో మాట్లాడారు. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుందన్నారు. సాయంత్రం వర్షం తగ్గిన తర్వాత లొద్ద జీపుల వద్దకు చేరుకొని తిరుగు పయనమయ్యారు.

# సామర్లకోటలో భారీ వర్షానికి రైళ్ల పట్టాలపైకి చేరిన నీరు

**నమస్తే హైదరాబాద్ :** కాకి నాడ జిల్లా సామర్లకోటలో వర్షం కుంభవృష్టిగా కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్ల వారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి లోత ట్టు, మెరక ప్రాంతాలు పూర్తిగా జలమయమ య్యాయి. పలు కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. భారీ వర్షానికి ఏడీబీ రోడ్డు మీదుగా వరద నీరు పెద్ద ప్రవాహంలా వీర్రాజునగర్, ఎఫ్‌సీఐ గోదాములు, సత్యనారాయణపురం మీదు గా ఆదివారం తెల్లవారుజాము నుంచి రైలు పట్టాలపైకి చేరింది. రైల్వే స్టేషన్‌లోని ఐదు ట్రాక్‌లపై అడుగు ఎత్తున నీరు నిలిచి పోయింది. దీంతో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ స్తంభిం చింది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఔటర్ సిగ్నల్ వద్ద రైళ్లను నిలుపుదల చేసి రైల్వే సిబ్బంది సహాయం తో స్టేషన్‌కు తీసుకువచ్చి తిరిగి పంపే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సుమారు 14 గంటల పాటు విజయవాడ, విశాఖ వైపు రైళ్లు 10–20 నిమిషాల ఆలస్యంతో రాకపోకలు సాగిం చాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గుర యాృరు. మరోపక్క రైల్వే ట్రాక్‌పైకి వరద నీరు చేరకుండా నియంత్రించేందుకు రెండు ఎక్స్‌కవేట ర్ల సహాయంతో అధికారులు సహాయ చర్యలు చే పట్టారు. పెద్దపులి చెరువు, మట్టపల్లివారి చెరువు, సంపంగ తోట చెరువులు పూర్తిగా నీటితో నిండా యి. ఆ నీరు ఎగువ ప్రాంతాల నుంచి చేరడంతో ఎఫ్‌సీఐ తూముల నుంచి డీఎస్‌పీ క్వార్టర్స్ తూముల మీదుగా గోదావరి కాలువలోకి మళ్లించేం దుకు రైల్వే అధికారులు ఎంతో శ్రమించాల్సి వచ్చి ంది. ఆదివారం రాత్రికి కూడా రైల్వే స్టేషన్‌లోని ఐదు ట్రాక్‌లపై వరద నీరు పూర్తిస్థాయిలో తొలగి పోలేదు. వర్షాలు తగ్గుముఖం పడితే సోమవారం తెల్లవారుజాము నాటికి నీటిని తొలగించే చర్య లు పూర్తవుతాయని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ 'ఆంధ్ర జ్యో తి'కి తెలిపారు. ఇటీవల ఆరేళ్లలో కురిసిన వర్షాలకు ట్రాక్‌పైకి ఇంతలా నీరు చేరిన దాఖలాలు లేవని అధికా రులు చెప్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా సామర్లకోట మండ లంలో 132.4 మి.మీ. వర్షపాతం నమో దైం దని మండల గణాంకఅధికారి ప్రసాద్ చెప్పారు.



# జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత అవగాహన




**నమస్తే హైదరాబాద్ :** జిల్లాలో జీఎస్టీ 2.0 (సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్) సంస్కరణలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించామని, దీని కోసం నెలరోజుల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారి మురళీ మనోహర్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జీఎస్టీ 2.0 (ఉత్సవ్) అవగాహన కార్యక్రమాల ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్ల బత్తుల కార్తీక్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని విభాగాల సహకారంతో జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగం చేసుకొని ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. జీఎస్టీ సంస్కరణలు వ్యాపారులు, వినియోగదారుల మధ్య సులభమైన పన్ను విధానం పారదర్శకతను తీసుకురావడమే లక్ష్యమన్నారు. జీఎస్టీ స్లాబ్‌ల గురించి పూర్తిగా వివరించామన్నారు. మొదటివారం మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బందితో, రెండోవారం వ్యవసాయ అనుబంధ శాఖలతో, మూడోవారం మున్సిపల్, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమ శాఖల సిబ్బందితో, నాల్గోవారం టూరిజం, రవాణా, విద్యుత శాఖల సిబ్బందితో గ్రామసభలు ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సులభమైన సేవలు అందించేందుకు హెల్ప్‌లైన, సలహా డెస్కులు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలు చేస్తున్న జీఎస్టీ విధానం వల్ల ప్రజలకు లాభాలు కలుగుతున్నాయన్నారు. అంతకుముందు డీఈవో ఆధ్వర్యంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జీఎస్టీ అంశం ప్రదర్శనలు జరిగాయి.

# బాణసంచా కొనుగోలు వేసి తీసుకెళ్తున్న పట్టణ ప్రజలు



**నమస్తే హైదరాబాద్ :** :బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలంటే రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీసు, జీఎస్టీ, మున్సిపాలిటీ శాఖల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ ప్రకారంలో జిల్లా వ్యాప్తంగా 175 దుకాణాలకు ఆయా శాఖల నుంచి అనుమతి పొందినట్లు అధికార లెక్కలు చెప్తున్నాయి. ఒక్కో దుకాణానికి లైసెన్సు కోసం.. అగ్నిమాపక శాఖకు- రూ.500, రెవెన్యూ శాఖకు రూ.500, జీఎస్టీ రూపంలో- అడ్వాన్సు ప్రాంతాల వారీగా రూ. 6వేల నుంచి రూ.14 వేలు వరకు. ఈ లెక్కన మొత్తంగా సుమారు రూ.20వేలు మాత్రమే ఖర్చు అవుతుందని సమాచారం. అధికార లెక్కల ప్రకారం.. జిల్లాలో నంద్యాల-71, శ్రీశైలం-10, ఆత్మకూరు-23, ఆళ్లగడ్డ-20, డోన-17, బనగానపల్లె-34 చొప్పున మొత్తంగా 175 దుకాణాలకు అనుమతి పొందారు.

ఏ పార్టీ అధికారంలో ఉంటే

ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి ఆయా దుకాణాల ఏర్పాటు పనులు చేసుకుని ఒక్కొక్క దుకాణం నుంచి ధర ఫిక్స్ చేసి వసూలు చేసి సొమ్ము చేసుకుంటారు. ఈ క్రమంలో తాజాగా కూడా అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కలిసి నంద్యాలలో అనుమతి పొందిన 71 దుకాణాల వ్యాపారుల నుంచి ఒక్కో షాపు నుంచి రూ. 47,000 చొప్పున మొత్తంగా రూ.33.37లక్షలు వసూ చేశారని తెలిసింది.

బాణసంచా ఇవ్వాలని షరతు

ఒక్కో షాపునకు రూ.47వేలు వసూలు చేయడంతో పాటు.. ఆయా శాఖలతో పాటు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులకు బాణసంచా ఇవ్వాలని షరతు సదరు నాయకులు విధించారని తెలిసింది. దీంతో ఆలస్యంగా లైసెన్సులు ఇచ్చారని ఆవేదన చెందారు. మొత్తంగా నాయకులు.. అధికారుల తీరుతో ఆయా వ్యాపారుల్లో ఆయోమయం తలెత్తే దుస్థితి. బాణసంచా అనుమతుల రూపంలో నాయకులు.. కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపించినట్లైంది.

అధిక ధరలకు విక్రయించి.. నాయకుల దందా.. అధికారులు చేతివాటంతో విసిగిపోయిన పలు దుకాణదారులు సైతం తమదైన శైలిలో బాణసంచాను జీఎస్టీ సాకుతో అధిక ధరలకు విక్రయించి క్యాష్ చేసుకుంటున్నారు. ఈక్రమంలో ప్రజలకు బాణ సంచా రూపంలో జేబులకు చిల్లుపడినట్లైంది. ఇదే క్రమంలో బాణసంచా వ్యాపారాల సమయంలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన అధికారులు సైతం నిద్రమత్తులో ఉండటం పలు విమర్శలకు తావిస్తోంది.పేలుతున్న ధరలునంద్యాల కల్చరల్ : టపాసుల ధరలు పేలుతున్నాయి. దీపావళి వైభవమంతా బాణ సంచాలోనే ఉంది. పిల్లలు, పెద్దలు అంతా బాణసంచా కాల్చడానికి పండుగ కోసం ఎదురు చూస్తారు. ఈసారి బాణసంచా ధరలు ఆకాశంలో ఉన్నాయి. తారాజువ్వలు, భూచక్రాలు, టపాకాయల ధరలు భారీగా పెరిగాయి. చిన్నారులు కాకరపువ్వులను చిట్టిచేతుల్తో పట్టుకొని గిరాగిరా తిప్పుతుంటే ఆన ందించే తల్లితండ్రులు బాణసంచా ధరలతో బెంబేలెత్తి పోతున్నారు. రూ.2000 పెట్టినా చేతికి సరిపడే బాణసంచా వచ్చేలాలేదు.

# వంజంగి టూరిజంపై 22న ఐటీడీఏలో సమన్వయ సమావేశం



**నమస్తే హైదరాబాద్ :** పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే పాడేరు మండలం వంజంగి హిల్స్ ప్రస్తుతం వివాదాల్లో చిక్కుకుంది. ఇప్పటి వరకు ఐటీడీఏ నేతృత్వంలో స్థానిక గిరిజనుల ఆధ్వర్యంలో వంజంగి హిల్స్ ఉండగా, తాజాగా అటవీ శాఖ స్వాధీనానికి చర్యలు చేపడుతుండడంతో వివాదం నెలకొంది. ఇన్నాళ్లూ మిన్నకుండి తాజాగా కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడతామని అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమైంది. దీని వలన తమకు అన్యాయం జరుగుతుందని స్థానిక గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరు నుంచి ఏజెన్సీలో పర్యాటక సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో ముఖ్యమైన వంజంగి హిల్స్‌పై వివాదాలు నెలకొనడంతో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

వంజంగి హిల్స్‌పై అధికారుల అనాలోచిత నిర్ణయమే ఇప్పుడు వివాదానికి కారణమైందనే వాదన బలంగా వినిపిస్తున్నది. పాడేరు మండలం వంజంగి కొండలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ప్రాంతాలు. అయితే ఆయా ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలుగా గుర్తించి, ప్రకటించే క్రమంలోనే అధికార యంత్రాంగం పక్కా నిర్ణయం తీసుకుని అటవీ చట్టాలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ ఐటీడీఏ, అటవీ అధికారులు అప్పట్లో ఆ దిశగా కనీసం ఆలోచన చేయకుండా తమ అనాలోచిత నిర్ణయాలతో ఐదేళ్ల క్రితం వంజంగి హిల్స్‌ను పర్యాటక ప్రదేశంగా ప్రకటించి, స్థానిక గిరిజనులతో ఒక కమిటీని వేసి దాని నిర్వహణను అప్పగించారు. ఆ సమయంలోనే అటవీ శాఖాధికారులు తమ అభ్యంతరాలను తెలిపి, అటవీ చట్టాలకు లోబడి వంజంగి హిల్స్ నిర్వహణ జరిగేలా చూడాల్సి ఉండగా, కనీసం పట్టించుకోలేదు. దీంతో అది రిజర్వు ఫారెస్ట్ అనే విషయాన్నే ఐటీడీఏ అధికారులు మరిచి, మామూలు కొండల్లో వలే పర్యాటకులకు ప్రవేశం, స్థానికులకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. దీంతో గత ఐదేళ్లుగా అదే విధంగా పరిస్థితులు కొనసాగుతున్నాయి. వంజంగి కొండలు రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని ప్రాంతాలు కావడంతో వాటిని స్వాధీనం చేసుకునేందుకు అటవీ శాఖ తాజాగా చర్యలు ప్రారంభించింది. ఇన్నాళ్లూ ఊరుకుని తాజాగా కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడతామని అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వాటిని స్వాధీనం చేసుకుంటామని అటవీ అధికారులు ముందుకు వెళ్లగా, స్థానికులు అభ్యంతరాలు తెలుపుతుండడంతో ప్రస్తుతం వివాదం నెలకొంది. దీంతో అటవీ సిబ్బంది వంజంగి హిల్స్ వైపు రాకూడదని స్థానికులు, అవి మా రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాలని అటవీ శాఖ పేర్కొంటున్నది. ఈ నెలాఖరు నుంచి పర్యాటక సీజన్ ప్రారంభం కానుండడంతో ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో అర్థంకాక జిల్లా యంత్రాంగం తల పట్టుకుంటున్నది. 22న సమన్వయ సమావేశం వంజంగి హిల్స్‌పై పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపడుతున్న క్రమంలో అటవీశాఖ, స్థానిక గిరిజనుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఐటీడీఏ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రజాప్రతినిధులు, వంజంగి, లగిశపల్లి, కాడెలి పంచాయతీల ప్రజలు, పలు సంఘాలు, కమిటీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని సూచించారు. అలాగే ఈ సమావేశానికి ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ. డివిజనల్ అటవీ అధికారి పీవీ.సందీప్‌రెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు హాజరవుతారు. ఈ క్రమంలో వంజంగి హిల్స్‌పై స్థానికుల సహకారంతో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టేందుకు అందరి నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు సేకరించి, అందరి సమన్వయంలో వంజంగి హిల్స్‌పై పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగం భావిస్తున్నది.

# కొండకిందపల్లెలో జల్లికట్టు

**నమస్తే హైదరాబాద్ :** వెదురుకుప్పం మండలం కొండకిందపల్లెలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జల్లికట్టు జరిగింది.చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆ గ్రామానికి జనం చేరుకున్నారు.కోడెగిత్తల కొమ్ములకు పట్టీలను కట్టి అల్లి వైపు వదలడంతో యువకులు ఆ పట్టీలను దక్కించుకోవడానికి గిత్తలను నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో తిరుపతికి తరలించారు.



# ఆదిత్యుని ఆదాయం రూ.3.50 లక్షలు



**నమస్తే హైదరాబాద్ :** అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి ఆదివారం రూ.3,50,721 ఆదాయం లభిం చింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.79, 500, విరాళాలు రూ.1,23,446, ప్రసాదాల ద్వారా రూ.1,38,275 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి అనివెట్టి మండపంలో ఆదివారం శివ పంచాయతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ లింగార్చన చేశారు. కార్యక్రమంలో పండితులు దర్భ ముళ్ల శ్రీనివాస శర్మ, ఆర్.వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు వెండి బిందెలు అందజేత..

# సమ్మెకు దిగిన మైనింగ్ కార్మికులు



**నమస్తే హైదరాబాద్ :** మండలంలోని దువ్వాం పంచాయతీ పరిధిలో గల డీఎఫ్ఎన్‌లో మైనింగ్ కార్మికులు ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. డీఎఫ్ఎంకు చెందిన ఆర్పీఎస్ దాస్ కంపెనీకి చెందిన దేవాడ, సదానందపురం, దువ్వాము తదితర మైనింగ్ కంపెనీలలో సుమారు గత 50 సంవత్సరాల నుంచి 261 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇటీవల సదరు పరిశ్రమకు మైనింగ్‌కు సంబంధించిన లీజులు కాలపరిమితి అయిపోయింది. దీంతో మైనింగ్‌లో పనిచేసిన 261 మంది కార్మికులను సెటిల్‌మెంట్ చేసి తొలగిస్తామని పరిశ్రమ యాజమాన్యం వారు అంటున్నారు. దీనికి కార్మికులు ససేమిరా అంటున్నారు. తిరిగి పరిశ్రమకు మైనింగ్ లీజులు వచ్చేంతవరకు వేచి ఉంటామని, లీజు అనుమతులు పొందిన తర్వాత పనిలోకి వస్తామని కార్మికులు తమ యూనియన్ అయిన సీఐటీయూ నాయకుల ద్వారా యాజమాన్యా నికి విన్నవించుకున్నారు. ఈ సమస్యపై గత కొంతకాలంగా యాజ మాన్య వర్గాలకు, సీఐటీయూ నాయకులకు పలు దఫాలుగా చర్చలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా యాజమాన్యం వారు కార్మికుల అనుమతు లు లేకుండా వారి బ్యాంకు అకౌంట్లలో సెటిల్‌మెంట్‌కు సంబంధించిన డబ్బులను జమచేశారు. విషయం తెలుసుకున్న మైనింగ్ కార్మికులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పరిశ్రమకు చెందిన డీఎఫ్ఎన్‌లో ఉన్న పరిశ్రమ ప్రధాన కార్యాలయం వద్ద మెరుపు సమ్మెకు దిగారు. ఎట్టి పరిస్థితిలోనూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు, మైన్స్ నాయకులు అప్పలనాయుడు, పాపినాయుడు, రమణ, సన్యాసినాయుడు, వీరభద్రం తదితరులు నాయకత్వం వహించారు.

# ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక



**నమస్తే హైదరాబాద్ :** కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, అక్టోబరు 19: ఆనందాల డోలిక.. వెలుగుల వేడుక దీపావళి. ఇంటిల్లిపాది ఉత్సాహంగా జరుపుకునే సంబరం. ముచ్చటగా రెండు రోజుల పాటు సాగే ఈ వేడుకలో ఆదివారం నరక చతుర్దిని నిర్వహించారు. సోమవారం దీపావళిని ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఏటా ఆశ్వయుజ అమావాస్య రోజున చీకట్లను పారదోలుతూ, లోకాన వెలుగులు నింపుతూ వేడుకను జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించే విజయానికి ప్రతీకగా సంబరాలను నిర్వహించుకుంటారు. కొత్త పద్దులు సిద్ధం చేసుకొని, లక్ష్మిపూజలకు వ్యాపారులు సమాయత్తమవుతున్నారు. దీపావళికి నోములు నోచుకుకోడానికి సిద్ధమయ్యారు.

'దీపేన సాధ్యతే సర్వం' అని శాస్త్ర వచనం. 'దీపంతో దేనినైనా సాధించొచ్చు'అని దీని సారాంశం. నిత్యం ఉదయం, సాయంత్రం సంధ్య వేళల్లో ఇంట్లో వెలిగించిన దీపాలు ఐశ్వర్యకారకంగా నిలుస్తాయని ధార్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏదైనా కోరిక తీరాలంటే ఒక దీపాన్ని వెలిగించి, ఫలం, పుష్పాలు సమర్పించి, ఇష్టదేవతకు నమస్కరిస్తే చాలని పురాణాలు పేర్కొంటాయి. దీపమున్న చోట దేవతలు నివసిస్తారని దీపావళి రోజున ఇళ్లల్లో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని స్వాగతిస్తారు.

శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైన వేడుక

దీపావళి రోజు దీపలక్ష్మి తన కిరణాలతో అమావాస్య చీకట్లను పార దోలి, జగత్తును తేజోవంతం చేస్తుంది. అందుకే దీపావళి నాడు సర్వ శుభాలు, సంపదలు ప్రసాదించే లక్ష్మీదేవిని పూజించడం మన సంప్ర దాయం. లక్ష్మీదేవి దీపజ్యోతిగా, జ్యోతిని లక్ష్మి మూర్తిగా భావించి దీపావళి రోజున దీపాలు వెలిగించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

నరకాసురుడిని వధించిన సందర్భంగా..

లోక కంటకుడైన నరకాసురుడిని సత్యభామ వధించడం, ముల్లోకాలను గడగడలాడించిన లంకాధిపతి దశకంఠుడ్ని శ్రీరాముడు జయించిన సందర్భంగా ప్రజలు ఆనందంగా దీపాలు వెలిగిస్తూ, బాణసంచా కాలుస్తూ సంబరంగా దీపావళి వేడుక నిర్వహించారనేది పౌరాణిక ప్రాశస్త్యం. కౌరవులు సాగించిన మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడేళ్లు అరణ్యవాసం, ఏడాది అజ్ఞాత వాసం ముగించుకొని తమ రాజ్యానికి తిరిగి వచ్చిన సందర్భంగా దీపాలు వెలిగించి ప్రజలు దీపావళి జరుపుకొన్నారని భారతంలో ఉంది.

దుకాణాలు కిటకిటలాడుతున్నాయి

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఆనందాల దీపావళిని అప్రమత్తంగా జరుపుకోవాలని పలువురు అధికారులు, తదితరులు సూచిస్తున్నారు. టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

దీపావళికి ప్రాముఖ్యత ఉంది

దీపావళి పండుగకు వైజ్ఞానికంగా మానవ సమాజానికి మేలు చేసే ఎంతో ప్రాముఖ్యత ఉంది. అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి, జ్ఞానం అనే దీపాన్ని వెలిగించుకొని ప్రతి వ్యక్తి జీవితంలో ముందుకు పోవాలనే అర్థం ఇందులో ఉంది. ఈ వేడుకలో దీపాల అలంకరించడంతో వచ్చే వెలుగు మానసిక ఆనందాన్ని కలిగిస్తే, దీపాల వెలుగుతో పాటు బాణసంచా వెలుగుతో వచ్చే కాంతి మనసులో భయాలను దూరం చేస్తుంది.

# వడ్డెరలకు పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..

## వడ్డెరలను గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పాలాభిషేకం..






**నమస్తే హైదరాబాద్ :** గత కొన్ని సంవత్సరాల నుంచి మేము జీవనం కోల్పోయాం మా కులవృత్తి ని మరిచిపోయే పరిస్థితులు వచ్చాయి. మేము తాత ముత్తాతల దగ్గర నుంచి ఇబ్రహీంపట్నం పక్కన ఉన్న కొత్త గేటు క్వారీలో కంకర కొట్టుకొని జీవనం కొనసాగించేవాళ్ళం క్వారీ రోడ్డు ప్రక్కన ఉండటంవల్ల వాహనదారులకు అక్కడ పరిసరాల్లో ఉంటున్న నిరాసితులకు ప్రమాదకరంగా మారిందని అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు క్వారీని నిలిపివేయడం జరిగింది . అదే కోరిలో కులవృత్తి పనులను నిర్వహిస్తున్న వారికి ఇక్కడే మాకు స్థలాలు కేటాయించారు కానీ మేము జీవనం కోల్పోయామంటూ తిరగని కార్యాలయాలు లేవు తిరగని ప్రజాప్రతినిధులు లేరు మైనింగ్ శాఖ కార్యాలయాలు చుట్టూ తిరిగి తిరిగి మేము అలసిపోయాం అదే సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మా వడ్డెరలను గుర్తించి 15% రిజర్వేషన్ కల్పించి 50% రాయితీ కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వెలకట్టలేని ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియపరిచారు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా, రావి ఫణి, జటీ పి టీ, దుర్గా మహాలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అంతా మంచే జరుగుతుంది అన్ని సామాజిక వర్గాల వారికి పెద్దపీట వేయటమే లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోహార్ వడ్డే ఓబన్న. జోహార్ వడ్డే ఓబన్న అనే నినాదాలతో మారుమోగించారు ఈ కార్యక్రమంలో,
ఈ ర్ల దుర్గారావు, బొంత బాబు, వల్లెపు కనకయ్య, ఆలకుంట మట్టయ్య, బత్తుల కృష్ణ, స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు వడ్డెర సంఘ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు



**నమస్తే హైదరాబాద్ :** మండల ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు కైకలూరు నియోజక వర్గం ముదినేపల్లి తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,యువనాయకులు ఆదిత్య చౌదరి ఆంధ్రరాష్ట్ర ప్రజలందరికి దీపావళి శు భాకాంక్షలు తెలియ చేస్తూ గత ప్రభుత్వం హయాములో ప్రజలందరూ ఎన్నో ఇబ్బందులకు గురి ఐయ్యారని, రాష్ట్ర అభివృద్ధి చెందకుండా నిర్వీర్యం చేసారని,ప్రజాస్వామ్య బద్దంగా పరిపాలన చేయకుండా నియంత పరిపాలన చేశారని,ఆంధ్రప్రదేశ్ ని అస్తవ్యస్తం చేశారని, ఎన్.డీ.ఎ.కూటమి ద్వారా చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడుతూ రాష్ట్రప్రజలు ఉన్నతంగా జీవించాలి అనే సంకల్పంతో అలుపెరగకుండా రాష్టాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని,ముఖ్యమంత్రి చంద్రన్న ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ప్రజా క్షేమంకొస క్రమశిక్షణతో ప్రజాస్వామ్యబద్దముగా కేంద్రం నుండి నిధులను తీసుకువస్తూ అభివృద్ధి చేస్తున్నారన్నారు నిరుద్యోగ నిర్మూలన చేసి,ఉద్యోగ,ఉపాధి ద్వారా అందరి కుటుంబాలలో అమావాస్య చీకట్లు తొలగిపొయి దీపాల దివ్వెల వెలుగుల తో అందరి కుటుంబాలలో వెలుగును,సుఖ,సంతోషాలు, నింపాలని ఎన్.డీ.ఏ. కూటమితొ చంద్రన్న ప్రభుత్వం ద్వారా అసాధ్యాన్ని, సుసాధ్య చేసన్తా ముందుకు తీసుకువెళు తున్నారని,తెలుగుదేశం,ఎన్.డీ.ఏ. ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు రాష్టంలోని ప్రతి కుటుంబం లో ప్రతిరోజు దీపావళిగా సుఖ,సంతోషాలతో, ఆయురారోగ్యాలతో,ఆనందంగా సిరి,సంపదలతో ఉండాలని కోరుకుంటూ, ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలియచేసారు ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి బొంగు రవి, పెదపాలపర్రు గ్రామ సర్పంచ్ గంట రాకేష్ కుమార్,ఉప సర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# అల్పపీడనం ఎఫెక్ట్... తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు



**నమస్తే హైదరాబాద్ :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 21వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 22వ తేదీ నుంచి ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. తెలంగాణలో పలు జిల్లాలకు వర్షసూచన ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు...తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇవాళ(ఆదివారం) వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో వానలు కురుస్తాయని వెల్లడించారు. పలు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. వీటితో పాటు ఇవాళ(ఆదివారం), రేపు( సోమవారం) తెలంగాణలో తేలికపాటి వర్షాలు పడతాయని వివరించారు. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. చెట్ల కింద ప్రజలు నిలబడవద్దని సూచించారు హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు.
అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ లక్ష్మీశాఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో కురుస్తున్న వర్షాలపై కలెక్టర్ డా.జి.లక్ష్మీశా ఇవాళ(ఆదివారం) ఉదయం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదలపై క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాల కోసం 9154970454 నెబర్‌లో సంప్రదించాలని కోరారు. 24%శ%7 అందుబాటులో ఉండేలా సమన్వయ శాఖల సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు కలెక్టర్ లక్ష్మీశా. డివిజన్ స్థాయిలోనూ కంట్రోల్ రూమ్‌లను క్రియాశీలం చేయాలని దిశానిర్దేశం చేశారు. కృష్ణా, బుడమేరు, మున్నేరులో ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆజ్ఞాపించారు. నదీపరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విజయవాడ అర్బన్ పరిధిలో కొండ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మార్గనిర్దేశం చేశారు కలెక్టర్ లక్ష్మీశా.క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాల ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కృష్ణా నదితో పాటు వాగులు, వంకలవైపు ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. దీపావళి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. దుకాణదారులకు, ప్రజలకు కూడా జాగ్రత్తలు తెలియజేయాలని కలెక్టర్ లక్ష్మీశా సూచించారు.

# అచ్యుతాపురం, 'పేటల్లో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

**నమస్తే హైదరాబాద్ :** మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి తర్వాత మొదలైన వర్షం.. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఆగకుండా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వర్షం నీరు రహదారులపై ప్రవహించడంతో కాలువలను తలపించాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా రహదారులపై ఎక్కడ గోతులు వున్నాయో తెలియక వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. వర్షం కారణంగా బాణసంచా విక్రయదారులు ఆందోళన చెందారు. వాతావరణం మసుగ్గా వుండడంతోపాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షాపుల ముందు బురదగా వుండడంతో సాయంత్రం వరకు దుకాణాలు తెరవలేదు. కాగా ఉదయం ఎనిమిది గంటల తరువాత వర్షం తెరిపిచ్చినప్పటికీ.. సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై వుంది. పాయకరావుపేటలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు కాలనీలు నీటమునిగాయి. ఆనందనగర్ కాలనీ, ఇందిరా కాలనీలో ఆదివారం మధ్యాహ్నం వరకు అడుగులోతున నీరు నిలిచి ఉండడంతోపాటు ఇళ్లలోకి చేరింది. దీంతో సామగ్రి తడిపోయి పలువురు ఇబ్బంది పడ్డారు. కొంతమంది ఇళ్లలోకి వచ్చిన వర్షం నీటిని బయటకు పంపేందుకు మోటార్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ప్రైవేటు లేఅవుట్లలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా లేకపోవడంతో వర్షం నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కాలనీల్లో కురిసిన వర్షం నీరు త్వరగా బయటకు పోవడానికి సరైన అవుట్‌లెట్‌లు లేకపోవడంతో డ్రైనేజీల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. కోటవురట్లలో కుండపోత..మండలంలోని పలుగ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. వర్షం నీటితో రహదారులు వాగులను తలపించాయి. చెరువులు ఇప్పటికే నిండడంతో అలుగులు పారుతున్నాయి. గెడ్డలు, వాగులతోపాటు సర్పా, వరాహ నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. రహదారులపై ఏర్పడిన గోతులు వర్షం కారణంగా మరింత పెద్దవి అవుతున్నాయి.



# వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా 'గుంజ శ్రీనివాసు'..



**నమస్తే హైదరాబాద్ :** వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీ ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ మంత్రి, వైసీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ సిఫార్సుల మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. నూతన అధికార ప్రతినిధిగా నియమితులైన శ్రీనివాసును పార్టీ పట్టణ నేతలు, కార్యకర్తలు అభినందించారు.

# జూపల్లిలో గజరాజుల దాడులు



**నమస్తే హైదరాబాద్ :** పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోదబండ నుంచి శనివారం రాత్రి బయలుదేరిన 7 ఏనుగుల గుంపు అటవీ సరిహద్దులో ఉన్న పాళెం పంచాయతీ జూపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు శివయ్య, రఘు, జయపాల్, మునస్వామి, మోహన్, సుబ్బరత్నకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు పూర్తిగా విరిచేశాయి. కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. పశుగ్రాసాన్ని తినేశాయి. పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును గమనించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. టపాకాయలు శబ్ధాలు వినడంతో ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు ప్రజలు తెలిపారు. అటవీ సరిహద్దు గ్రామాలకు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, దీంతో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎఫ్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.


# ముగిసిన కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు



**నమస్తే హైదరాబాద్ :** శ్రీనివాసమగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం రాత్రి పూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవాలలో భాగంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. అనంతరం యాగశాలలో వైదిక కైంకర్యాలు జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో కొలువు దీర్చి సుగంధ ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు యాగశాల వైదిక కైంకర్యములు, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో జేఈవో వరబ్రహ్మం దంపతులు, డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్ధసార?ధి, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేషకుమార్, ఇన్స్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# చెడుపై మంచి సాధించిన విజయమే దీపావళి

## ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్



**నమస్తే హైదరాబాద్ :** నియోజకవర్గంలోని ప్రజలందరికీ దీపావళి సందర్భంగా శుభములు కలగాలని ఆశిస్తూ మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ శుభాకాంక్షలను తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగా దీపావళి జరుపుకుంటారని, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి చీకటి ప్రారదోలి వెలుగులను ప్రసాదించిన దీపావళి అందరి జీవితాలలో సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలు అందరూ ఆనందముతో దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపావళి బాణాసంచా కాల్చేటప్పుడు ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకొని భద్రతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలను తెలియజేశారు..

# సినిమా



## పవన్ కల్యాణ్ అంటే పిచ్చి.. కానీ ఇప్పుడు ఆయన సినిమాలో యాక్ట్ చేయను:

ఈ దీపావళికి నాలుగు సినిమాలు రిలీజయ్యాయి. మిత్రమండలి, తెలుసు కదా, డ్యూడ్, కె-ర్యాంప్ ఒకటి, రెండు రోజుల వ్యవధిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటిలో కె-ర్యాంప్ సినిమా పై ఆడియెన్స్ ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తున్నారని తెలుస్తోంది. డబుల్ మీనింగ్ డైలాగులు ఎక్కువగా ఉన్నాయని విమర్శలు వచ్చినా కిరణ్ అబ్బవరం సినిమా హాయిగా నవ్వుకునేలా ఉందని కాంప్లిమెంట్స్ వినిపిస్తున్నాయి. జైన్స్ నాని తెరకెక్కించిన ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్ గా నటించింది. నరేశ్ మరో కీలక పాత్రలో మెరిశాడు. గత దీపావళికి క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం ఈసారి కె-ర్యాంప్ తో మరో హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం ఈ సినిమాకు హిట్ టాక్ రావడంతో మరింతగా ప్రమోట్ చేసే పనిలో ఉన్నాడు కిరణ్. వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నాడు. ఇదిలా ఉంటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు కిరణ్.'మీకు పవన్ కళ్యాణ్ అంటే ఇష్టం కదా. ఆయన సినిమాల్లో నటించే అవకాశం వస్తే చేస్తారా'అని యాంకర్ అడిగిన ప్రశ్నకు ఇలా ఆన్సరిచ్చాడు కిరణ్ అబ్బవరం. 'నాకు పవన్ కళ్యాణ్ అంటే చాలా ఇష్టం. ఈ విషయం ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. కానీ, ఆయన సినిమాల్లో ఇప్పుడు నేను చేయలేను. ఎందుకంటే, ఇప్పుడు నేను హీరోగా నా కెరీర్ బిల్డ్ చేసుకునే ప్రాసెస్ లో ఉన్నాను. కాబట్టి, ఈ టైంలో మళ్లీ సైడ్ క్యారెక్టర్స్ అంటే చేయలేను. ఒకవేళ అవకాశం వస్తే కూడా.. ఈ క్యారెక్టర్ కిరణ్ అబ్బవరం అయితేనే చేయగలడు అనేలా ఉంటే చేస్తా. కానీ, పవన్ కల్యాణ్ సినిమాలో కనిపించాలని మాత్రం చేయను. ఇప్పుడు అంతా నా ఫోకస్ సినిమాలు, నా మార్కెట్ మీదనే ఉంది' అని కిరణ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ హీరో కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి. చాలా మంది కిరణ్ ఓపెన్ గా మాట్లాడడని ప్రశంసలు కురిపిస్తున్నారు.





## మీకు బీపీ లేదా షుగర్ ఉందా..? అయితే దీపావళి రోజు కచ్చితంగా ఈ జాగ్రత్తలు తీసుకోండి!

దీపావళి సందర్భంగా టపాసుల మోత మోగిపోతూ ఉంటుంది. దాంతో పాటు పండగ ఆనందంలో చాలా మంది స్వీట్లు ఎక్కువగా తింటారు. ఇదే సమయంలో మధుమేహం, బీపీ రోగుల ఆరోగ్యం తీపి పదార్థాలు, వేయించిన ఆహారాలు, మారుతున్న దినచర్యల కారణంగా ప్రభావితమవుతుంది. ఈ సమయంలో ప్రజలు తమ ఆహారాన్ని నియంత్రించుకోవడం మర్చిపోతారు, ఇది రక్తంలో చక్కెర, రక్తపోటు స్థాయిలను మరింత దిగజార్చుతుంది. ఆలస్యంగా మేల్కొని ఉండటం, ఒత్తిడి, కాలుష్యం కూడా పరిస్థితిని మరింత దిగజార్చుతాయి. అందువల్ల సరైన ఆహారం, క్రమం తప్పకుండా మందులు తీసుకోవడం, తగినంత నిద్ర చాలా అవసరం.పండుగ సమయంలో చెడు ఆహారపు అలవాట్లు, అధిక స్వీట్లు, ఉప్పు తీసుకోవడం మధుమేహం, రక్తపోటు రోగులకు ప్రమాదకరం. ఇది రక్తంలో చక్కెర పెరుగుదల, రక్తపోటులో ఆకస్మిక పెరుగుదల లేదా తగ్గుదల, గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. నూనె ఆహారాలు, చక్కెర పానీయాలు కూడా వాపు, అలసటను పెంచుతాయి. ఇంకా నిద్ర లేకపోవడం, మానసిక ఒత్తిడి పరిస్థితిని మరింత దిగజార్చుతాయి. దీపావళి రద్దీ సమయంలో మందులు లేకపోవడం వల్ల గ్లూకోజ్ లేదా రక్తపోటు అసమతుల్యత ఏర్పడుతుంది, ఇది ఆసుపత్రిలో చేరడానికి కూడా దారితీస్తుంది.

దయాబెటిస్, బిపి రోగులు ఈ విషయాలను గుర్తుంచుకోవాలి

ఢిల్లీలోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో ఇంటర్నల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ అలీ షేర్, దీపావళి వంటి పండుగల సమయంలో షుగర్, బీపీ ఉన్న వాళ్లు ఇంట్లో తయారుచేసిన చక్కెర లేని స్వీట్లు లేదా ఎండిన పండ్లను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అలాగే ఆలస్యంగా మేల్కొని ఉండటం, ఒత్తిడికి గురికావడం లేదా అతిగా అలసిపోవడం మానుకోండి, ఎందుకంటే ఇవి గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. పండుగ సమయంలో మీ మందులు తీసుకోవడం, హైడ్రేటెడ్‌గా ఉండటానికి పుష్కలంగా నీరు తారాగడం గుర్తుంచుకోండి. రోజూ ఒక చిన్న నడక, తేలికపాటి యోగా లేదా ధ్యానం శరీరాన్ని చురుకుగా, మనస్సును ప్రశాంతంగా ఉంచుతుందని డాక్టర్ సూచిస్తున్నారు. మంచి ఆరోగ్యం, ఆనందాన్ని నిర్ధారించడం ద్వారా పండుగను మితంగా, సమతుల్యతతో ఆస్వాదించడం చాలా ముఖ్యం.



## యమ డేంజర్..

### వీళ్లు సీతాఫలం అస్సలు తినకూడదు..!

సీతాఫలం ఆరోగ్యానికి చాలా మంచిది. విటమిన్లు, లవణాలు అధికంగా ఉండి, కొవ్వు ఏ మాత్రం ఉండదు. శీతాకాలం మొదలైతే అందరూ సీతాఫలం గురించే ఆలోచిస్తారు. ఈ సీజన్‌లో లభించే సీతాఫలం తినడానికి అందరూ ఇష్టపడతారు. కానీ, కొందరు మాత్రం సీతాఫలం అస్సలు తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎవరు సీతాఫలం తినకూడదు..? ఎందుకు అనే దాని గురించి ఇక్కడ తెలుసుకుందాం..ప్రస్తుతం చాలా మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది భారతదేశంలోనే ఉన్నారని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే భారతదేశాన్ని మధుమేహ రాజధాని అని కూడా పిలుస్తున్నారు. నేడు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయసుల వారికి డయాబెటిస్ పెద్ద సమస్యగా మారింది. మారుతున్న జీవనశైలి, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్లే డయాబెటిస్ వస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

సీతాఫలంలో యాంటీఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్లు, విటమిన్లు సి, బి6, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. డయాబెటిస్ ఉన్నవారు అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లను తీసుకుంటారు. అధిక గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న పండ్లలో సీతాఫలం ఒకటి. ఈ పండులో ఫ్రక్టోజ్ ఉన్నందున మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.


ఇన్సులిన్ వాడని మధుమేహ రోగులు సీతాఫలాన్ని మితంగా తినవచ్చు. 15 రోజులకు ఒకసారి తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు మారవు. అయితే, ఇన్సులిన్ తీసుకునే మధుమేహ రోగులు ఈ పండు తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు పెరుగుతాయి. ఈ తీపి పండు తినడం వల్ల వారి చక్కెర స్థాయిలు పెరిగితే, వారు మళ్ళీ వారి ఇన్సులిన్ స్థాయిలను పెంచాల్సి ఉంటుంది. అందుకే డయాబెటిస్ ఉన్నవారు ఈ పండు తినకూడదని సలహా ఇస్తారు.

మధుమేహం ఉన్నవారు తినకూడదు. ఒకవేళ తినాలనిపిస్తే మామూలుగా పండిన పండును మాత్రం తింటే ఎలాంటి బాధా ఉండదు. అదే ఎక్కువగా పండిన పండును మాత్రం తిన్నట్లయితే అందులో గ్లూకోజ్ శాతం ఎక్కువగా ఉండి, చక్కెర వ్యాధిగ్రస్తులకు ఎక్కువగా హాని చేస్తుంది. అలాగే లివర్ వ్యాధితో, మూత్రపిండాల వ్యాధితో బాధపడేవారు సైతం ఈ సీతాఫలానికి దూరంగా ఉండాలి. అలాగే, ఆస్తమా ఉన్నవారు కూడా ఈ సీతాఫలంను తీనకూడదని నిపుణులు చెబుతున్నారు..

## టీమిండియా ఘోరంగా ఓడిపోయినా.. తెగ సంతోషపడుతున్న శుభమాన్ గిల్.

ఇంగ్లండ్ పర్యటనలో టెస్ట్ సిరీస్ ఎలా ప్రారంభమైందో, ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్ కూడా అదే విధంగా ప్రారంభమైంది. ఇది టీమిండియా కొత్త కెప్టెన్ శుభమాన్ గిల్ కథ. టెస్ట్, వన్డే కెప్టెన్‌గా, రెండు ఫార్మాట్లలో తన మొదటి మ్యాచ్‌లోనే గిల్‌కు ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియాపై పెర్త్‌లో జరిగిన మొదటి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు అన్ని రంగాల్లో విఫలమైంది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు ప్రభావవంతంగా కనిపించిన ఏ భాగం లేదు. అయితే, ఇంత ఘోర పరాజయం పాలైనప్పటికీ కొత్త కెప్టెన్ శుభమాన్ గిల్ పెద్దగా నిరాశ చెందలేదు. పైగా తాను ఏ విషయంలో సంతృప్తి చెందాడో కూడా చెప్పాడు.

వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్ అత్యంత పేలవంగా కనిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ఈ మ్యాచ్‌లో 136 పరుగులు మాత్రమే చేసింది. వర్షం కారణంగా నాలుగు సార్లు ఆగిపోయిన ఈ మ్యాచ్‌లో ఓవర్లను



26కి తగ్గించారు. అయితే భారత బ్యాట్స్‌మెన్లు ఏ దశలోనూ పూర్తి 50 ఓవర్లు ఆడేలా కనిపించలేదు. జట్టులోకి తిరిగి వచ్చిన స్టార్ బ్యాట్స్‌మెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ గిల్, వైస్-కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా పెద్దగా ఆడలేదు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు లభించిన లక్ష్యాన్ని కేవలం 22 ఓవర్లలోనే ఛేదించి విజయం సాధించింది.

టీమిండియా 7 వికెట్ల తేడాతో ఓటమిని ఎదుర్కొన్నప్పటికీ, కెప్టెన్ గిల్ ఆస్ట్రేలియాను సులువుగా గెలవనివ్వలేదనే విషయంలో సంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టు పేలవమైన బ్యాటింగ్, ఆ తర్వాత బౌలింగ్ గురించి మాట్లాడుతూ గిల్ ఇలా అన్నాడు.. "మీరు పవర్‌ప్లేలో 3 వికెట్లు కోల్పోయినప్పుడు ఎల్లప్పుడూ పుంజుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. ఈ మ్యాచ్‌లో మేము నేర్చుకోవలసినవి చాలా ఉన్నాయి. కొన్ని పాజిటివ్స్ కూడా ఉన్నాయి. మేము కేవలం 130 పరుగులు మాత్రమే కాపాడుకోవాల్సి ఉంది. అయినప్పటికీ ఆటను చాలా దూరం వరకు తీసుకెళ్లాం. దీనితో మేము సంతృప్తి చెందాం." అన్నాడుడక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం ఆస్ట్రేలియాకు గెలవడానికి 26 ఓవర్లలో కేవలం 131 పరుగుల లక్ష్యం లభించింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆస్ట్రేలియాకు 22 ఓవర్ల వరకు శ్రమించాల్సి వచ్చింది. ఇది నిజమే. అయితే, దీనికి మరో కోణం కూడా ఉంది.. ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్ చేసే సమయంలో ఒక్కసారి కూడా ఇబ్బంది పడినట్లు కనిపించలేదు. మిచెల్ మార్ష్ తన జట్టును ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులువుగా లక్ష్యం చేరుకునేలా చేశాడు. కాబట్టి, జట్టు మ్యాచ్‌ను చాలా దూరం వరకు తీసుకెళ్లింది అని గిల్ చెప్పడం అంతగా నమ్మదగింది కాదు. ఇప్పుడు కెప్టెన్ రెండవ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని ఆశిస్తున్నాడు.



Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..